క్లుప్తంగా

రైతులపై దోపిడీని అరికట్టాలి

గద్వాల అర్బన్: జిల్లాలోని విత్తన పత్తి సాగు చేస్తున్న రైతులపై ఆర్గనైజర్లు, కంపెనీల దోపిడీని అరికట్టాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రం లోని ఆ సమితి కార్యాలయంలో సీడ్ పత్తి రైతులతో సమావేశం నిర్వహించారు. సీడ్‌పత్తి రైతుల సమస్యల పరిష్కారానికి త్వరలో కార్య చరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, శ్రీనివాస్ యాదవ్, లవన్న, విష్ణు రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కన్నుమూత

అలంపూర్ : శ్రీజోగుళాంబ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ తిరుపతి రెడ్డి(75) ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హైదరబాద్‌లోని వారి నివాసంలో చికిత్స పొందుతున్న ఆయన మృతి చెందినట్లు పేర్కొన్నారు. అంత్యక్రియలు ఉండవెల్లి మండలం కలుగోట్ల గ్రామంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తిరుపతి రెడ్డి అలంపూర్ శ్రీజోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు, గ్రామ ప్రజలు ఆయన భౌతికాయాన్ని సందర్శించి పూల మాల వేసి నివాళులర్పించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



గద్వాల అర్బన్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని మైనార్టీ సబ్ ప్లాన్ నాయకుడు అతిఖుర్ రహ్మాన్ అన్నారు. ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రహ్మాన్ మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించి గద్వాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్సీ వర్గీకరణను అడ్డుకుందాం’



మదనాపురం: ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామని, ఎట్టి పరిస్థితుల్లో జరిగేది లేదని ఎస్సీ వర్గకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ ములకలపల్లి మద్దిలేటి పిలుపు నిచ్చారు. ఆదివారం దుప్పల్లిలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నూతన కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా నరేందర్, ప్రధాన కార్యదర్శిగా అశోక్ కుమార్, కోశాధికారిగా శివ కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిసెంబర్ 1న జరిగే మాలల సింహగర్జన సభ కరపత్రాలు విడుదల చేశారు. మాల ఉద్యోగులు, మహిళలు పెద్దలు వివిధ రకాల వ్యాపారస్తులు వివిధ రకాల కుల సంఘాల నాయకులు పాల్గొన్నాలని కోరారు.

కేంద్రాల్లో ధాన్యాన్ని వెంటనే కాంటా చేయాలి



పాన్‌గల్: కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంటనే కాంటా చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని సీపీఎం మండల నాయకులు భీమయ్య, సూర్యవంశ రాము డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలను మంత్రి జూపల్లి ప్రారంభించి వారం రోజులవుతున్నా నేటికి కాంటా చేయకపోవడంతో రైతులు కేంద్రాల వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్రాల్లో ధాన్యం కాంటా చేయడంలో జాప్యం చేస్తుండటంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తున్నారన్నారు. సన్న రకం వడ్లకు ఇస్తున్న రూ.500 బోనస్‌ను దొడ్డు వడ్లకు కూడా అందించాలన్నారు. దీంతో పాటు కేంద్రాల్లో నీడ కోసం టెంట్, నీటి వసతి కల్పించాలన్నారు. కేంద్రాల్లోని ధాన్యం కాంటా చేయాలని లేనిచో రైతులతో కలిసి ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కమలాకర్, రైతులు పాల్గొన్నారు.

సంత.. సమస్యలు కొండంత

- ప్రధాన రోడ్డు పక్కనే విక్రయాలు
- ప్రత్యేక స్థలం లేక తప్పని తిప్పలు
- నేలపైనే అమ్మకంతో దుమ్ము ధూళీ ప్రభావం



రాజోళిలో రోడ్డు పక్కనే నేలపై కొనసాగుతున్న సంత

రాజోళి: రాజోళిలో జరిగే సంత నిత్యం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. వారానికి ఒకసారి వచ్చే సంతతో మధ్య తరగతి కుటుంబాల వారికి ఎంతో ఆసరాగా ఉంటుంది. వారానికి సరిపడా కూరగాయలు, ఇతర సరులకు సరసమైన ధరలకు కొనుగోలు చేసి డబ్బు ఆదా చేసుకుంటారు. సంతలో అమ్మకాలు చేసే చిరు వ్యాపారులు సరుకును గిట్టుబాటు ధరలకు అమ్ముకుని లాభాలు గడిస్తుంటారు. కానీ ఈ ప్రక్రియ సక్రమంగా సాగాలంటే దానికి సరైన వేదిక ఉండాలి. అదే సంత. ఆ సంతలో కొండంత సమస్యలతో క్రయ విక్రయ దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మేజర్ గ్రామ పంచాయతీ, మండల కేంద్రం రాజోళీలో ఇవే సమస్యలు సంత వినియోగదారులను, అమ్మకం దారులను వేధిస్తున్నాయి.

ప్రతి ఆదివారం సంత....

కొత్త రాజోళిలో ప్రతి ఆదివారం సంత జరుగుతుంది. ఇందులో వ్యాపారాలు చేసుకునేందుకు రాజోళితో పాటు, వడ్డేపల్లి, శాంతిగనర్ తదిదర గ్రామాల నుంచి కూరగాయలు, పండ్లు, ఇతరత్రా నిత్యావసరాలు విక్రయించేందుకు చిరు వ్యాపారులు వస్తుంటారు. ఆదివారం సాయంత్రం సమయంలో సంత జరిగినప్పటికీ, తమ గ్రామాల నుంచి సరుకుతో ప్రైవేట్ వాహనాలకు అద్దెలు చెల్లించి మధ్యాహ్నం సమయానికే అక్కడకు చేరుకుంటారు. రోడ్లకు ఇరువైపులా కూరగాయలు, పండ్లు, నిత్యావసర సరుకులు అమ్మకాలు చేస్తున్నారు. దీంతో రోడ్లపై వెళ్లే వాహనాల దుమ్ము ధూళి వాటిపై పడటంతో పాటు, అమ్మకం దారులు, వినియోగదారులకు కూడా ఇబ్బందిగా మారింది.

షెడ్లు కూడా కరువే...

సంత వ్యాపారుల కోసం కనీసం చిన్నపాటి షెడ్లయినా ఏర్పాటు చేస్తే ఆసరాగా ఉంటుందని విక్రయదారులు తెలిపారు. వర్షం వచ్చినా, తిరిగి వెళ్లే సమయంలో ఆలస్యమైనా, అత్యవసర సమయంలోనైనా తమ సరుకు షెడ్లల్లో ఉంచుకుంటే కొంత భద్రత ఉంటుందని వ్యాపారులు అంటున్నారు. నిత్యావసర సరుకులు, ధాన్యం చిన్నపాటి వర్షానికే మొత్తం తడిసిపోయి నష్టం చవిచూడాల్సి వస్తుందని వాపోతున్నారు. సంత ఆవరణలో కనీస సౌకర్యాలు కూడా లేవని ఆరోపిస్తున్నారు. గతంలో నాబార్డు నిధుల ద్వారా షెడ్లు నిర్మించేందుకు అప్పటి గ్రామ పంచాయతీ సర్పంచ్ వెంకటేశ్వరమ్మ ప్రతిపాదనలు పంపినప్పటికీ..అది అటకెక్కడంతో షెడ్ల నిర్మాణం నిలిచిపోయింది. కొత్త రాజోళిలోనే సంతకు సరిపోయే బజారులో 20 షెడ్లను నిర్మించాలని, సంతకు ఆదరణ తగ్గకముందే, చిరు వ్యాపారులకు నష్టం కలగకముందే కనీసం షెడ్లు నిర్మాణం చేయాలని, సర్వసభ్యమావేశాలు, జెడ్పీ సమావేశాల్లో విన్నవించినా, జిల్లా అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా అది నిరుపయోగంగానే మారింది. దీంతో చిరు వ్యాపారులు రాజోళిలో సంత చేయాలంటే ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వర్షం వస్తే తీవ్ర నష్టం..



ఎక్కువగా రాజోళి సంతలో కూరగాయలు అమ్ముతుంటాం. కానీ సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇతర గ్రామాల నుంచి వచ్చి సంతలో వ్యాపారం చేసుకునే వారికి చాలా ఇబ్బందికరంగా ఉంది. షెడ్లు ఏర్పాటు చేస్తే క్రయవిక్రయాలకు అనువుగా ఉంటుంది. అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలి.

కుర్వ క్రిష్ణ, సంత వ్యాపారి, రాజోళి

ప్రతిపాదనలు పక్కకు పెట్టారు..



గతంలో నాబార్డు నిధుల ద్వారా సంత వ్యాపారుల కోసం షెడ్లు నిర్మించాలని ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపాం. కనీసం 20 షెడ్లు నిర్మిస్తే వ్యాపారులకు బాసటగా ఉంటుందని భావించాం. కానీ ప్రతిపాదనలు అటకెక్కాయి. గతంలో ఎన్నో సార్లు జిల్లా అధికారులకు కూడా విన్నవించాం.

వెంకటేశ్వరమ్మ, మాజీ సర్పంచ్, రాజోళి

సమాజానికి మరిన్ని రచనలు అందించాలి



శ్రీనివాసులుకు పుస్తకాన్ని బహూకరిస్తున్న షేక్ అస్లాం షరీఫ్

శాంతినగర్: సమాజానికి అవసరమైన రచనలు భవిష్యత్తులో మరిన్ని అందించాలని శాంతినగర్ సేవా సమితి సభ్యుడు షేక్ అస్లాం షరీఫ్‌ను జిల్లా గ్రంథాలయాల చైర్మెన్ నీలి శ్రీనివాసులు కోరారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌కు చెందిన సేవా సమితి సభ్యుడు అస్లాం షరీఫ్ గద్వాలలో ఆదివారం జరిగిన 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం మర్యాద పూర్వకంగా గ్రంథాలయాల చైర్మెన్ నీలి శ్రీనివాసులును కలిసి తాను రచించిన నవ్వులే నవ్వులు పుస్తకాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జోక్స్ పుస్తకాలతో పాటు సమాజానికి అవసరమైన వివిధ రచనలు రచించాలని ఆకాంక్షించారు. చైర్మన్ కోరికను తప్పక నెరవేరుస్తానని అస్లాం షరీఫ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, రాజోళి మండల మాజీ వైస్ ఎంపీపీ రేణుక దంపతులు పాల్గొన్నారు.

కుక్కదాడిలో 30 గొర్రెలు మృతి



మానవపాడు: మండలంలోని జల్లాపురంలో గొల్లరాముడుకు చెందిన గొర్రె పిల్లల మందపై వీధి కుక్క దాడి చేసి 30 గొర్రె పిల్లలను చంపింది. చుట్టు పక్కల పొలంలో ఓ రైతు గమనించి గొర్రెల యాజమానికి విషయం తెలుపంగా మంద దగ్గరకు వచ్చి కుక్కను చంపేశాడు. సుమారు రూ.1.50 లక్షలు నష్టం జరిగినట్లు గొర్రెల యాజమాని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున అదుకోవాలని కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

గట్టు: కార్తీక మాసం సందర్భంగా ఆదివారం తారాపురం గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక అయిజ కమిటీ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. అయిజ కమిటీ అధ్యక్షుడు నరేష్ మాట్లాడుతూ.. ఆలయాలకు చేరుకునే వారు ధ్వజ స్తంభం నుంచి గర్భగుడిలోకి ప్రవేశించి, బయటకు వచ్చే వరకు ఇతర విషయాలను విస్మరించి, దైవ ధ్యాసంలోనే ఉండాలని కోరారు. కార్తీక మాసంలో అందరూ దీపాలను వెలిగించి, యోగ సాధన చేయాలన్నారు. అనంతరం త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలపై గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో సేవా సమితి కమిటీ సభ్యులు భాస్కరాచారి, వీరేష్, విజయ్, దేవేంద్ర, శారద, భారతి, అక్షయ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే



అమరవాయిలో సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్లు

మల్దకల్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఆదివారం చర్లగార్లపాడు, నీలిపల్లి, అమరవాయి, నాగర్‌దొడ్డి ఎల్కూరు, తాటికుంట, మద్దెలబండ, సద్దలోనిపల్లి,ఉలిగేపల్లి, మేకలసోంపల్లి గ్రామాల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరిగి కుటుంబ సభ్యుల వివరాలు రికార్డులలో పొందుపరిచారు. మల్దకల్, సద్దలోనిపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ రాజశేఖర్‌లు పరిశీలించారు. ఎలాంటి తప్పులు లేకుండా కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోపాలకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ



నాటవెల్లి సమీపంలో మానవత విశ్వవిద్యాలయ ప్రాంగణంలో గోపాలకృష్ణ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

కొత్తకోట రూరల్: మండలంలోని నాటవెల్లి గ్రామ సమీపంలోని మానవత విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఆదివారం గోపాలకృష్ణ విగ్రహప్రతిష్ఠ, గణపతి, సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం గోశాలలో గోపాల కృష్ణ విగ్రహ ప్రతిష్ఠ, యోగశాలలో పతంజలి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ, ఆరోగ్య శాలలో ధన్వంతరి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ, ధ్యాన క్షేత్రంలో బుద్ధ భగవానుడి విగ్రహ ప్రతిష్ఠ, విద్యా, జ్ఞానానికి సంబంధించి గురువు దక్షిణామూర్తి విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించారు. కార్యక్రమంలో నాటవెల్లి గ్రామ ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విగ్రహాల ప్రతిష్ఠ విజయవంతంగా చేశారు. ఈ సందర్భంగా మానవత విశ్వవిద్యాలయ నిర్వహకులు శ్రీనివాస్ చౌదరి మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో అంతరించిపోతున్న మానవత విలువలు, గో పరిరక్షణ కోసం మానవులు చేపట్టాల్సిన కార్యాలపై అవగాహన కల్పించారు. భారతీయ సంస్కృతిని పూర్వ వైభవంతో పునరుద్ధరించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. సనాతన ధర్మంపై విశ్వాసం ఉండాలన్నారు. అదే విధంగా గో సేవ చేయడం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. విద్య, వైద్య విధానాలు, విలువలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. భావి తరాలకు ఒక విలువలతో కూడిన, వ్యక్తిత్వ విశ్వాసంతో ఉన్న సమాజం నిర్మించడమే ప్రతి ఒక్కరి లక్ష్యమన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.

వాల్మీకిలు లక్ష్యాల వైపు మరలాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వాల్మీకి నాయకులు

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె గ్రామంలోని ఆదివారం జిల్లా వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి విద్యా చైతన్య యాత్రలో భాగంగా జిల్లా వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వాల్మీకి జిల్లా ఉద్యోగ సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు హాజరై అవగాహన కల్పించారు. పాఠ్య పుస్తకాలు మాత్రమే చదివితే పనివంతుల వుతామని, గొప్ప వ్యక్తుల పుస్తకాలు చదివితే గొప్ప వ్యక్తులవుతామన్నారు. వాల్మీకులు తమ లక్ష్యాల వైపు మరళాలన్నారు. కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ మేడికొండ ఈశ్వర్, జిల్లా వాల్మీకి ఉద్యోగ సంఘం కోశాధికారి అశోక్, వాల్మీకి నాయకులు డీలర్ వెంకన్న, వీరన్న, నాగేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని వికాస్ స్వామి ఇంట్లో అయ్యప్ప పడిపూజా కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పంచామృతాభిషేకం ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామి శరణుగోషతో ఆ ప్రాంతం పులకరించింది. వినాయకుడు, కుమార స్వామి, లక్ష్మీదేవికి అష్టోత్తరణలు నిర్వహించారు. పూలతో అయ్యప్ప స్వామి పదునేట్టంబడి పడిని అందంగా అలంకరించారు. స్వాములు ఆడిన పెటతుల్లి అకట్టుకుంది. అనంతరం స్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్వాములు ముక్సన్, భాస్కర్, వెంకటేశ్, శశిధర్, రామ్, నవీన్ ,శ్రీహరి, ఆనంద్, ఆభిలాష్, ఆశోక్, కన్నయ్య, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిచారో.. అంతే సంగతులు



శిథిలావస్థలో ఉన్న కల్వర్టు

మల్దకల్: మండలంలోని కుర్తిరావులచెర్వు- మల్దకల్ గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు రక్షణ గోడ కూలి ప్రమాదభరితంగా మారింది. ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి నాగర్‌దొడ్డి రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన కాలువపై ఏర్పాటు చేసిన కల్వర్టు కొద్ది రోజుల క్రితం కూలింది. ఈ రహదారిపై ప్రతి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ఎప్పుడూ ప్రమాదం జరుగుతుందోనని వాహన దారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మత్తులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని వాహన దారులు కోరుతున్నారు.

బీటీ రోడ్డుపై గుంతలు పూడ్చాలి



గుంతలమయమైన ఎల్కూరు- మల్దకల్ రహదారి

మల్దకల్: ఎల్కూరు- మల్దకల్ గ్రామాల మధ్యన బీటీ రోడ్డుపై గుంతలు పూడ్చాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు. 10 ఏళ్ల క్రితం వేసిన బీటీ రోడ్డు గుంతలమయంగా మారిందని వాపోతున్నారు. దీంతో ప్రతి నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు ఇటీవల ఎల్కూరు పెద్దచెరువు నుంచి గట్టుకు భారీ వాహనాలతో మట్టి తరలిస్తుండంతో రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ విషయమై అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాహన దారులు కిష్టన్న, తిమ్మప్ప, రాముడు, నర్సింహులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలు పూడ్చాలని కోరుతున్నారు.

‘ఉపాధి’ భవనం.. నిరుపయోగం

- వాస్తుదోషం పుకారుతో ప్రారంభానికి నోచుకోని ఈజీఎస్ కార్యాలయం
- ఎంపీడీఓ ఆఫీసులో పనిచేస్తున్న అధికారులు
- అవస్థలు పడుతున్న అధికారులు



ప్రారంభానికి నోచుకోని ఈజీఎస్ కార్యాలయ భవనం

అయిజ: మండల పరిషత్ కార్యాలయం పక్కన నిర్మించిన మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ ఈజీఎస్) నూతన కార్యాలయ భవనం పూర్తై 13 సంవత్సరాలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఈజీఎస్ సంబంధించిన రూ. 25 లక్షల నిధులతో ఈజీఎస్ కార్యాలయ భవనంతో పాటు మహిళా సమాఖ్య (సెర్ఫ్) కార్యాలయ భవనం నిర్మానానికి 11-11-2011 తేదీన అప్పటి మంత్రి డీకే అరుణ శంకుస్థాపన చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో సమావేశ మందిరంతో పాటు మహిళా సమాఖ్య కార్యాలయం నిర్మించారు. నిర్మాణం పూర్తై సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రారంభించక పోవడంతో ఈజీఎస్ అధికారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. సొంత భవనం లేకపోవడంతో ఎంపీడీఓ కార్యాలయంలోని రెండు చిన్న గదుల్లో విధులు నిర్వహిస్తున్నారు.

భవనానికి వాస్తు దోషం...

నూతనంగా నిర్మించిన ఈజీఎస్ కార్యాలయంలో కొంతకాలం మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు వారి కార్యకలాపాలు నిర్వహించారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో వారు పాత బస్టాండ్‌లోని పాత మున్సిపల్ కార్యాలయంలోకి మకాం మార్చారు. అయితే భవనానికి వాస్తు దోషం ఉందని పుకార్లు పుట్టాయి. అప్పటి నుంచి ఆ భవనంలోకి ఎవరూ రాలేదు. ఇప్పుడు ఈజీఎస్ నూతన భవనం ఖాళీగానే ఉంది. నూతన భవనంలో కూడా మౌళిక వసతులు అంతంత మాత్రమే. విద్యుత్ బోర్డులు సరిగ్గా లేవు, బాత్రూమ్‌లో వాటర్ ట్యాబ్‌లు విరిగిపోయాయి, వాటి నుంచి నీళ్లు వచ్చే అవకాశం లేదు. ఉన్నతాధికారులు స్పందించి ఈజీఎస్ నూతన భవనంలో మౌళిక వసతులు కల్పించి భవనాన్ని ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సకాలంలో పనులు కావట్లేడు..



మండల పరిషత్ కార్యాలయం భవనంలో ఎంపీడీఓ కార్యాలయంతో పాటు సమావేశ మందిరం, ఈజీఎస్ కార్యాలయం ఒకే చోట ఉండడంతో ఎప్పుడూ జనాలతో సందడి సందడిగా ఉంటుంది. ప్రజలు ఎక్కువై గందరగోళంగా తయారైంది. ఎవరి ఆఫీస్‌లు వారికుంటే బాగుంటుంది. ఉన్నతాధికారులు స్పందించి నూతన ఈజీఎస్ కార్యాలయం భవనాన్ని ప్రారంభించాలి స్తే బాగుంటుంది.

దావూద్, అయిజ

వాస్తు దోషమని వెళ్లడం లేదు...



ఈజీఎస్ నూతన కార్యాయ భవనానికి వాస్తు దోషం ఉందని పుకార్లు రావడంతో కొంతమంది ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్‌లు ఆ భవనంలోకి వెళ్లడానికి సాహసించడం లేదు. వాస్తుపై నమ్మకంలేని మరికొంత మంది ఈజీఎస్ నూతన భవనంలో సౌకర్యాలు లేకపోవడంతో అయిష్టత చూపుతున్నారు. గత్యంతరం లేక ఎంపీడీఓ కార్యాలయంలోని ఇరుకైన గదులు ఉపయోగించుకుంటున్నాం.

లాలూ నాయక్, ఈజీఎస్ ఏపీఓ

ఉన్నతాధికారులకు తెలియజేశాం..



మండల పరిషత్ అధికారులు, ఈజీఎస్ అధికారులు, సిబ్బంది ఎంపీడీఓ కార్యాలయ భవనంలోనే పనిచేస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అనేక శాఖల అధికారులు, సిబ్బంది సమావేశాలు నిర్వహిస్తుంటారు. ఇరుకైన గదులలో విధులు నిర్వహిస్తుండడంతో పనులు సకాలంలో పూర్తిచేయలేకపోతున్నాం. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేశాం.

వెంకటయ్య , ఎంపీడీఓ

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు



చెట్లకొమ్మలు తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

అయిజ: పట్టణంలో, మండలంలోని వివిధ గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని ఏడీఈ నీలి గోవిందు అన్నారు. ఆదివారం పట్టణంలో మెరుగైన విద్యుత్ సరఫరాకు విద్యుత్ స్తంభాల వెంట ఉన్న చెట్ల కొమ్మలు కత్తిరించే పనులు విద్యుత్ సిబ్బంది చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పట్టణంలోని భరత్ నగర్, కొత్త బస్టాండ్, దేవనగర్, టీచర్స్ కాలనీ, గాజులపేట, తెలంగాణ చౌరస్తా, వెంకటరమణ కాలనీ, ఎస్సీ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కొంత కాలంగా సబ్‌స్టేషన్లలో మరమ్మత్తులు చేపడుతున్నట్లు తెలిపారు. వ్యాపారస్తులు, వినియోగదారులు, ప్రజలు సహకరించాలని ఏడీఈ నీలి గోవింద్ కోరారు. కార్యక్రమంలో అధికారులు, విద్యుత్ లైన్‌మెన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.